క్లుప్తంగా

విజేతలకు బహుమతుల పంపిణీ



ఉంగుటూరు: తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విలేజ్, క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్ మీట్ శనివారం నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, డైరెక్టర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ ప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటింగ్ మెంబర్ వినోద్ కుమార్, పీడీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి, దంత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో ఈ నెల 23న ఉచిత కంటి, నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుటపల్లి శివప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన కృష్ణసాయి డెంటల్ కేర్, మ్యాక్సివిజన్ ఐ హాస్పటల్ వైద్యుల నేతృత్వంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగులు, హెల్త్‌కార్డు కలిగిన ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ కార్డుదారులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పలు అభివృద్ధి పనులకు తీర్మానం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. తొలుత పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అజెండాలోని పలు అంశాలను పాలకవర్గ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్ నిర్మాణం, పంచాయతీ లైబ్రరీ మరమ్మతులు, అదనపు తరగతి నిర్మాణం తదితర అంశాలను ఆమోదించారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం పెదపులిపాక గ్రామానికి చెందిన ఎండీ రోషిని ఆరేళ్ల క్రితం మంగళగిరి మండలం నవులూరుకు చెందిన ఉమర్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. భర్త కారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అయితే ఇచ్చిన కట్నం సరిపోలేదని అదనపు కట్నం తీసుకురమ్మని భర్తతో పాటు అత్త మాబున్ని, ఆడపడుచులు కుర్షిద్, బాజీలు వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



రామవరప్పాడు: కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఎల్ రగ్బీ గేమ్ చాంపియన్‌షిప్‌కు ప్రసాదంపాడులోని వివేకానంద పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ బొప్పన హరికృష్ణ తెలిపారు. హరికృష్ణ మాట్లాడుతూ అండర్-14 కేటగిరిలో విద్యార్థులు ఎం.నిత్య, ఎండీ రహీమా, జి.లాస్య, కె.జస్వంత్ సూర్య, ఆర్.మురళీ విజయ్‌లు, అండర్-17 కేటగిరిలో ఎం.నందిని, ఎం.లావణ్య, కె.రామ్‌చరణ్‌లు కృష్ణా జిల్లా నుంచి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు ఉపాధ్యాయుల బృందం అభినందించింది. ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం అయ్యప్పనగర్‌కు చెందిన షేక్ నాగూర్(48) టైర్లు మరమ్మతు పనులు చేస్తాడు. అయితే అతను ఈ నెల 12న పోరంకి సెంటర్‌లో బందరు రోడ్డు దాటుతుండగా అతనిని కంకిపాడు వైపు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగూర్‌కు తీవ్ర గాయాలు అవ్వటంతో విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో అత్యవసర చికిత్సకై చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న నాగూర్ శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రసూల్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మెరుగైన వైద్యం అందించేందుకే

'ఫ్యామిలీ డాక్టర్'



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ గీతాభాయి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీతాభాయి అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లిలో బాపులపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్య సేవలు పొందించేందుకు వచ్చిన ప్రజలతో ఆమె ముచ్చటించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్యసేవలపై డీఎంహెచ్‌ఓ ఆరా తీశారు. అధికసంఖ్యలో అక్కడికి వైద్యం కోసం వచ్చిన బాలింతలు, గర్భిణులతో ఆరోగ్య పరిస్థితి గూర్చి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు అందుతున్న చికిత్స గురించి వివరాలు అడిగారు. కౌమారదశలో బాలికలు రక్తహీనత లేకుండా చూసుకోవాలని, తగిన పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలు తప్పక తీసుకోవాలని సూచించారు. బాపులపాడు పీహెచ్‌సీ వైద్యుడు నారయ్య, ఏఎన్ఎం సుశీలకు ఆమె పలు సూచనలు చేశారు.

నేటి నుంచి మహా సౌరయాగం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆదివారం నుంచి మహా సౌరయాగం నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు వివరాలు తెలిపారు. మాసదీక్షక పూర్వక ద్వాదశాదిత్యాత్మక మహాసౌరయాగం ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. బ్రహ్మశ్రీ కొత్తూరి భగీరథశర్మ ఆధ్వర్యంలో 12 మంది రుత్విక్కులతో సూర్యనమస్కారాలు చేస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం గణపతిపూజతో పూజా కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

సూర్య నమస్కారాల పోటీలు..

ఆలయంలో సూర్య నమస్కారాలపై ఆదివారం పోటీలు నిర్వహిస్తామని ఈఓ గంగాధరరావు తెలిపారు. ఈ పోటీలు మూడు క్యాటగిరీల కింద ఉంటాయన్నారు. 1–30 సంవత్సరాల వరకు, 31 నుంచి 50, 51 ఏళ్ల పైబడిన స్త్రీ, పురుషులకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఐదు నిమిషాల్లో ఎక్కువ సూర్య నమస్కారాలు చేసిన వారికి బహుమతులు ఇస్తామన్నారు. భక్తులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

మడిచర్ల అటవీ భూముల జాయింట్ సర్వే

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మడిచర్లలోని అటవీ భూముల సరిహద్దు వివాదం పరిష్కరించేందుకు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు శనివారం జాయింట్ సర్వే నిర్వహించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న రీసర్వేలో సుదీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి, ల్యాండ్ సర్వే విభాగం ఏడీ గోపాల్, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ సర్వే జోజిబాబు, నరసింహారావు, తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, మండల సర్వేయర్ రంగారావుతో పాటుగా అటవీశాఖ అధికారులు లెనిన్, తేజస్విలు జాయింట్ సర్వేకు హాజరైయ్యారు. మడిచర్ల గ్రామంలోని సర్వే నంబర్ 1తో పాటు పలు ఇతర సర్వే నంబర్లలో ఉన్న అటవీ భూములను, ఎఫ్ఎంబీలను బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో తొలుత రెవెన్యూ, సర్వే, ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. వీఆర్వో సుబ్బయ్య, గ్రామ సర్వేయర్ అలేఖ్య పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

కంకిపాడు: వివాహిత అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన వివాహిత (22) ఈనెల 20వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా విచారించినా ఆచూకీ తెలియలేదు. వివాహిత తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పునాదిపాడులో మరో వ్యక్తి..

కంకిపాడు: వ్యక్తి అదృశ్యం ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన చంద్రగిరి నవీన్(23) ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. నవీన్ భార్య విజయ కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కంకిపాడు పోలీసులు తెలిపారు.

మినుములో తెగుళ్ల నివారణకు చర్యలు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ భవాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మినుము పంటకు తెగుళ్లు సోకకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జోన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలో మినుము పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు శనివారం నిర్వహించారు. మినుము పంటకు పల్లాకు తెగులు తెల్లదోమ ఆశించటం ద్వారా సోకుతుందని, ఆకుల రసం పీల్చి పంటను నాశనం చేస్తుందని చెప్పారు. పల్లాకు తెగులు సోకినట్లైతే ఎకరాకు 100 మిల్లీలీటర్లు ఇమిడోక్లోప్రిడ్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మారుకా పురుగు పూత లేదా పిందదశలో ఆశించి మినుము పంటకు నష్టాన్ని కలిగిస్తుందన్నారు. పొలంలో రెక్కల పురుగులు కనిపించిన వెంటనే ఎకరాకు 100 మిల్లీ లీటర్లు వేపనూనెను పిచికారీ చేయాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం

విజయవాడరూరల్: గన్నవరం నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలను ప్రజల సౌకర్యార్థం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామని నియోజకవర్గం ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ ఎ.గోపాలరెడ్డి తెలిపారు. విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయానికి ఆయన శనివారం వచ్చిన సందర్భంగా ఓటర్ల జాబితాల వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో అత్యధికంగా విజయవాడ రూరల్ మండలంలోనే ఓటర్లు ఉన్నారన్నారు. మహిళా ఓటర్లు 53,142 మంది, పురుషులు 51,428 మంది ఉన్నారని చెప్పారు. గన్నవరం మండలంలో మహిళా ఓటర్లు 50,174, పురుషులు 47,492, బాపులపాడు మండలంలో మహిళా ఓటర్లు 48,034, పురుషులు 45,588, ఉంగుటూరు మండలంలో మహిళా ఓటర్లు 30,186, పురుషులు 27,951 మంది, థర్డ్ జెండర్స్ 25 మంది ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు ఆన్‌లైన్‌లో లేదా పోలింగ్ బూత్ స్థాయి ఆఫీసర్లను సంప్రదించాలని డీటీ గోపాలరెడ్డి తెలిపారు.

సెల్‌ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, అధికారులు

గన్నవరం రూరల్: సెల్‌ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ చెప్పారు. మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు విజ్ఞాన సమాహారంగా ఉపయోగపడాలని చెప్పారు. దురదృష్టవశాత్తు సెల్‌ఫోన్‌ల వాడకం నేటి విద్యార్థులపై దుష్పరిణామాలు చూపిస్తున్నాయన్నారు. బాలల హక్కులు, రక్షణ ప్రభుత్వ బాధ్యతగా చెబుతూ కమిషన్ ఈ విషయంపై విస్తృతంగా పని చేస్తుందన్నారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. అనీమియా సమస్యతో రేపటి తరం బాధపడకూడదని ఆలోచించిన ప్రభుత్వం వారికి అన్ని దశల్లోనూ పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నాగపద్మావతి మాట్లాడుతూ ముఖ్యంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరమన్నారు. గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సూర్యచంద్రరావు, సచివాలయం ఉద్యోగులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలసి అధికారులు భోజనం రుచి చూశారు. గురుకుల పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అప్రమత్తతతో ప్రాణాలకు భద్రత

ఉయ్యూరు: వాహనాలను నడిపేటప్పుడు అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రాణాలకు భద్రత చేకూరుతుందని జిల్లా రవాణా శాఖ అధికారి పి.సీతాపతి అన్నారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో రవాణా శాఖ, రోటరీక్లబ్ ఆఫ్ ఉయ్యూరు సంయుక్త ఆధ్వర్యంలో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు శనివారం నిర్వహించారు. వారోత్సవాలకు హాజరైన సీతాపతి మాట్లాడుతూ రహదారి భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియమ నిబంధనలు పాటించి వాహనాలను నడిపితే ప్రమాదాలు దరిచేరవన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దన్నారు. వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ కుటుంబాలను గుర్తిచేసుకుని అప్రమత్తతతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ సుబ్బారావు, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, సంపత్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాహనదారులకు ఉచితంగా కంటి, దంత పరీక్షలు నిర్వహించారు.

పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సిబ్బందికి సూచనలిస్తున్న పోలీసు అధికారులు

పెనమలూరు: పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఎస్పీ విజయ్‌పాల్ తెలిపారు. ఆయన శనివారం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేడు మండల పరిధిలో ఏడు పరీక్షా కేంద్రాల్లో 6,050 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ రాత పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరుగుతుందని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, భారీ భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. వీఆర్ సిద్ధార్థ కాలేజీలో పరీక్షా పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామన్నారు. పరీక్షా కేంద్రాలకు పశ్నాపత్రాలు సరైన సమయానికి తరలిస్తామని తెలిపారు. అభ్యర్థులు నిబంధనలకు లోబడి పరీక్ష రాయాలన్నారు. సమావేశంలో సీఐలు గోవిందరాజు, ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి



మానికొండలో సిబ్బందితో మాట్లాడుతున్న రామాచార్యులు

ఉంగుటూరు: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూపరింటెండెంట్ ఇంజినీర్ జయ రామాచార్యులు అన్నారు. మానికొండలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వచ్చే ఉగాది నాటికి 360 ఇళ్లు పూర్తి చేయలనే లక్ష్యంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పని చేయాలని ఆదేశించారు. హెడ్ క్వార్టర్ డీఈ రమేష్, గుడివాడ ఈఈ రామోజీనాయక్, గన్నవరం డీఈ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శేషగిరిరావు, హౌసింగ్ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, పక్కన సురేష్

కంకిపాడు: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. నామినేటెడ్ పోస్టులను కొనసాగిస్తూ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు వెలువరించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా వృత్తిదారుల సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అర్హతే ప్రామాణికంగా, రాజకీయాలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులకు పథకాలు అందుతున్నాయన్నారు. పార్టీ కోసం శ్రమించిన శ్రేణులను గుర్తించి సీఎం వైఎస్ జగన్ సముచిత స్థానం కల్పించారని చెప్పారు. ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు చేరువ అవుతుంటే ప్రతిపక్షాలు చూసి ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. కార్పొరేషన్ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపుతో రానున్న రోజుల్లో మరిన్ని సేవలు చేసేందుకు అవకాశం కల్పించారన్నారు. పార్టీ పటిష్టత, ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావటానికి ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు సాగుతామన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో వలంటీర్లకు నియామక పత్రాలు శనివారం ఎంపీడీఓ సునీతాశర్మ అందజేశారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముగ్గురు వలంటీర్లకు, తాడిగడప మున్సిపాలిటీలో 14 మందిని వలంటీర్లను ఎంపిక చేసి నియామక పత్రాలు అందచేశామని ఆమె తెలిపారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు సకాలంలో టీకాలు వేయాలి

అల్లాపురం(గన్నవరం): మండలంలోని అల్లాపురం గ్రామంలో శనివారం ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె. రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా గొర్రెలు, మేకలు వ్యాధుల బారినపడకుండా సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. ఇతర పశుగణాలతో పోల్చితే గొర్రెలు పెంపకం లాభాదాయకమని కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మంద శ్రీనివాస్ చెప్పారు. అనంతరం 11 పశువులకు సాధరణ జబ్బులకు వైద్యం, 430 గొర్రెలు, 33 మేకలకు నట్టలు నివారణ మందులు వేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు డి.నరేంద్రనాథ్, టి.సుస్మిత, పి.శిరీష, ఫైనల్ ఇయర్ వెటర్నరీ విద్యార్థులు పాల్గొన్నారు.